రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# ఇక నో హెల్మెట్.. నో ఎంట్రీ

**ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తాం**

**మల్టీజోన్ -2 ఐజీపీ షానవాజ్ ఖాసిం**



హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న ఐజీపీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మల్టీజోన్ -2 ఐజీపీ షానవాజ్ ఖాసిం తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు అలైవ్-అరైవ్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ షానవాజ్ ఖాసి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఇంట్లోనూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సేఫ్ డ్రైవింగ్ పట్ల పిల్లలకు, పెద్దలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి ఇంటి నుంచే మార్పు మొదలుకావాలని, ప్రతి ఒక్కరూ అరైవ్-అలైవ్ ప్రాముఖ్యతను గుర్తించాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ పూనాలని, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతోనే వంద శాతం విజయం సాధిస్తాయని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్‌ను ప్రమాద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచే ప్రారంభం కావాలని, నో హెల్మెట్..నో ఎంట్రీ, నో డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటి నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజల భద్రత కోసమే పనిచేస్తున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

**మైనర్‌ల డ్రైవింగ్‌పై వంద శాతం నిఘా : కలెక్టర్ దీపక్ తివారీ**

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రయాణంలో గమ్యం కంటే విలువైన ప్రాణాల రక్షణే ముఖ్యమని, కుటుంబ యజమాని ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికే రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీలు ప్రమాదాల తగ్గింపునకు నిరంతరం కృషి చేస్తాయని తెలిపారు. మైనర్‌ల డ్రైవింగ్‌పై తల్లిదండ్రులు వంద శాతం నిఘా ఉంచాలని, పిల్లలు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. ప్రతి నెలా రోడ్డు భద్రతా కమిటీల ద్వారా సమావేశాలు నిర్వహించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

**మారుమూల గ్రామాలకూ అలైవ్ అరైవ్ : ఎస్పీ**

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, అలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని జిల్లాలోని మారుమూల గ్రామాల వరకు తీసుకెళ్లేలా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరిస్తే ప్రమాదాల నుండి ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. మనకు తెలియకుండా జరిగేది యాక్సిడెంట్.. తెలిసి చేసేది నిర్లక్ష్యం అని, అతివేగం, అజాగ్రత్తే ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. పిల్లలకు వాహనాలు కొనిచ్చే ముందు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు గ్రామంలో నో హెల్మెట్..నో ఎంట్రీ, నో డ్రింక్ డ్రైవ్ కార్యక్రమాలు మొదలు పెట్టి, ప్రమాదాల నివారణలో వారి పాత్ర పోషించాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సురక్ష మిత్ర లోగోలు, వాల్ పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు వీడియోల ద్వారా అవగాహన కల్పించారు.

## దశలవారీగా సమస్యల పరిష్కారం

**శామీర్‌పేట, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తున్నట్లు, అదే విధంగా మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి పాటు పడుతున్నట్లు అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం అలియాబాద్ మున్సిపల్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డుల సభలు నిర్వహించారు. ఆయా వార్డుల నుంచి ప్రజలు పాల్గొని తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు, అవసరాలను, అభివృద్ధి సూచనలను అధికారుల దృష్టికి తీసుకవచ్చినట్లు తెలిపారు. తాగునీరు సరఫరా, పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరగుదల, పచ్చదనం పెంపుదతో పాటు పలు మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కౌన్సిలర్లు గుర్క కుమార్‌యాదవ్, జి.వెంకటేశ, మౌనిక, శిరీష, యమున, మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, . సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా అన్లోడింగ్

**హమాలీల సంఖ్య పెంచండి**

**అదనపు గోదాముల గుర్తింపునకు తక్షణ చర్యలు**

**అదనపు కలెక్టర్ ఆదేశం**

**వార్తకు స్పందన**

**రైస్‌మిల్లులు, గోదాముల తనిఖీ**



బొమ్మరాసిపేట్‌లో ధాన్య గోదామును సందర్శించి నిల్వలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**శామీర్‌పేట, జూన్ 10, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలో వరిధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ గోదామును, మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్లో ఉన్న వెంకటరమణ రైస్ మిల్లును ఆయన సంబంధిత అధికారులతో కలిసి స్వయంగా సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గోదాముల్లో ధాన్యం నిల్వలు, రైస్ మిల్లుల్లో అన్లోడింగ్ వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. బుధవారం వార్త పత్రికలో నడిరోడ్డుపై ధాన్యం.. కళ్లల్లో దైన్యం శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఈ తనిఖీలు చేపట్టారు. కొల్తూర్ రైస్ మిల్లులో ధాన్యం దిగుమతి, అన్లోడింగ్, నిల్వ ప్రక్రియలను పరిశీలించిన అనంతరం ఆయన మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే ధాన్యం వాహనాలను ఎటువంటి జాప్యం లేకుండా, త్వరితగతిన అన్లోడ్ చేయాలని ఆదేశించారు. వాహనాలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని, అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి అవసరమైన సంఖ్యలో హమాలీలను పెంచాలని సూచించారు. ధాన్యం దిగుమతి ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్లను (రశీదులను) పెండింగ్లో ఉంచకుండా వెంటనే జారీ చేయాలని, వాహనాల నిల్వ, అన్లోడింగ్, రశీదుల జారీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని మిల్లర్లకు తేల్చి చెప్పారు. అనంతరం బొమ్మరాసిపేట్లోని గోదామును సందర్శించిన ఆయన, అక్కడ నిల్వ ఉంచిన వరిధాన్యాన్ని పరిశీలించి, ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిల్వల కోసం అవసరమైతే అదనపు గోదాములను కూడా వెంటనే గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా, మండల స్థాయి అధికారులు, రైస్ మిల్లుల ప్రతినిధులు, గోదాముల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# బడిబాటకు బురిడీ

**ప్రభుత్వ లక్ష్యాలకు అధికారుల తూట్లు!**

**సర్కారు బడిలో డ్రాపౌట్స్‌ను నియంత్రించటమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి**

**ఇంటింటి ప్రచారం చేయాలని ఆదేశాలు**

**గ్రామాల ముఖం చూడని ఉపాధ్యాయులు**

**పాఠశాలల వద్దే ఫొటోలు దిగి ర్యాలీ విరమణ**

**బడికి రావలసిన విద్యార్థులను గుర్తించటంలో విఫలం**

**పెద్దేముల్‌లో సిబ్బంది తీరుపై స్థానికుల విస్మయం**



పాఠశాలలోనే ఫొటో దిగుతున్న ఉపాధ్యాయులు

**పెద్దేముల్, జూన్ 10, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం కేవలం పేరుకే జరుగుతోందని, అధికారులు, ఉపాధ్యాయులు దీనిని తూతూ మంత్రంగా నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి యేటా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచాలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాన్ని కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పూర్తిగా గాలికొదిలేశారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలో బడిబాట నిర్వహించవలసిన ఉపాధ్యాయులు అసలు గ్రామంలో పర్యటించి ఇంటింటి ప్రచారం చేయకుండా, పాఠశాలకే పరిమితమై అక్కడే ఫోటోలు దిగి బడిబాట ముగించడం పలువురిని ఆశ్చర్యపరిచింది. మండల కేంద్రంలోనే ఇంత తతంగం జరుగుతుంటే, ఇక మారుమూల గ్రామాల్లో బడిబాట పరిస్థితి ఏంటోనని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం కొన్ని చోట్ల కేవలం ఫోటోలకు పోజులు ఇవ్వడానికి, ర్యాలీలకే పరిమితం కావడంతో, బడికి రావలసిన విద్యార్థులను గుర్తించి చేర్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించే చర్యలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో తల్లిదండ్రులు ఈ నిర్వహణపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. విద్యార్థుల నమోదు లక్ష్యాలను చేరుకోవడంలో అధికారులు, ఉపాధ్యాయులు సరైన చర్యలు చేపట్టడం లేదని, సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై మండల విద్యాధికారి నర్సింగ్‌రావును వివరణ కోరగా, తాను మీటింగ్‌లో ఉన్నానని, తర్వాత ఫోన్ చేస్తానని చెప్పి సమాధానాన్ని దాటవేశారు.



మద్య నిషేధానికి ఎక్సైజ్, పోలీస్ శాఖల సహకారం కోరుతూ వినతిపత్రం ఇస్తున్న ధన్నారం గ్రామస్థులు

# బెల్ట్ షాపుల భరతం

**ధన్నారం గ్రామస్థుల చైతన్యం**

**యువత భవిష్యత్తు కోసం మూయించి వేశామని స్థానికుల ప్రకటన**

**మళ్లీ మద్యం షాపులు పుట్టుకొచ్చే ప్రమాదం ఉందని ఆందోళన**

**నిరంతర నిఘా ఉంచాలని పోలీసులకు విజ్ఞప్తి**

**వికారాబాద్, ప్రభాతవార్త :** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు ధన్నారం గ్రామస్తులంతా కలిసి, తమ గ్రామంలో స్వచ్ఛందంగా మద్యపాన నిషేధం విధిస్తూ బెల్ట్ షాపులను మూసివేయించారు. ఈ నిర్ణయం విజయవంతం కావడానికి పోలీస్, ఎక్సైజ్ శాఖల మద్దతు కోరుతూ వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, టౌన్ సీఐ రఘుకుమార్, ఎక్సైజ్ సీఐలకు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. మద్యానికి బానిసలై ఎంతో మంది యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారి భవిష్యత్తును కాపాడటానికే ఈ గట్టి నిర్ణయం తీసుకున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామంలో వారానికి ఒకసారైనా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, చాటుమాటుగా మద్యం అమ్మినా, తాగినా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మళ్లీ బెల్ట్ షాపులు పుట్టుకొచ్చే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందారు. గ్రామస్తులు చూపిన ఈ చైతన్యాన్ని, వారు తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాన్ని డీఎస్పీ అంజయ్య, సీఐ రఘుకుమార్ అభినందించారు.

# సిద్ధాపూర్‌కు డంపింగ్ యార్డ్ రాదు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటన**



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జెఎసి నాయకులు

**కొత్తూరు జూన్ 10, ప్రభాతవార్త :** పేద ప్రజలు తమ భూములు ఇచ్చింది ఉపాధి కోసం కానీ, పర్యావరణాన్ని నాశనం చేసే చెత్త యార్డ్ కోసం కాదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తేల్చి చెప్పారు. బుధవారం కొత్తూరు మండలంలోని ముదిరాజ్ సంఘ భవన ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్‌కు సంబంధించి కీలక ప్రకటన చేశారు. స్వయంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ని తాను కలిసి సిద్ధాపూర్‌లో ఎకో టౌన్ పేరిట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని వినతిపత్రం అందించానని చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, అక్కడ అలాంటిది ఏమీ లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని వివరించారు. డంపింగ్ యార్డ్ అనేది కేవలం అపోహేనని, సిద్ధాపూర్ ప్రాంతంలో ఎటువంటి డంప్ యార్డ్‌కు ఛాన్స్ లేదని, తాను ఎల్లప్పుడూ జనం పక్షానే ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రకటనతో జేఏసీ తరఫున అంబటి ప్రభాకర్ హర్షం వ్యక్తంచేశారు. గత కొన్ని రోజులుగా సిద్ధాపూర్, కొత్తూరు పరిసర ప్రాంతాల మనుగడ కోసం సాగిన ఈ ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను పక్కన పెట్టి, ప్రజల పక్షాన ఏకమవడం నిన్న మొన్నటి వరకు ఒక పెద్ద జేఏసీ కమిటీని ఏర్పాటు చేసి, అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా నాయకులంతా ఏకమై జేఏసీ ఆధ్వర్యంలో ఉధృతమైన పోరాటాన్ని నిర్వహించారని వివరించారు. పోరాటంలో జేఏసీకి అండగా నిలిచిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, యువతకు, ముఖ్యంగా ప్రాణాలను సైతం లెక్కచేయక రోడ్లపైకి వచ్చిన సిద్ధాపూర్, కొత్తూరు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆ.... బంధం వీడటంలేదని

**భార్యను బండరాయితో హత్య**

**తాండూరు, జూన్ 10, ప్రభాతవార్త :** తన భార్య వెరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందని ఓ వ్యక్తి బండరాయితో మోది హతమార్చాడు. ఈ సంఘటన తాండూరు మండలం అల్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కరణ్‌కోట్ పోలీసుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రం, పూర్నియా జిల్లాకు చెందిన జీరో రిషి కుటుంబం తాండూరు ప్రాంతానికి వలస వచ్చారు.
అల్లాపూర్‌లో ఉన్న వీఆర్ పాలిషింగ్ యూనిట్‌లో ఆరు నెలలుగా పనిచేస్తున్నారు. కొన్ని రోజులుగా తన భార్య సరితా దేవి స్థానికంగా ఉన్న వెరొక కార్మికుడు తోఫిక్ ఆలంతో అక్రమ సంబంధం కొనసాగిస్తోందని రిషి గమనించాడు. ఆ.. సంబంధం మానుకోవాలని రిషి భార్య సరితా దేవికి పలుమార్లు హెచ్చరించాడు. కానీ ఆమె భర్త మాట వినలేదు.
మంగళవారం రాత్రి 10-30 గంటల సమయంలో ఇదే విషయంపై భర్య, భర్తలు ఇద్దరు గొడవపడ్డారు. ఈ క్రమంలో రిషి పక్కనే ఉన్న బండరాయితో భార్యపై దాడి చేశాడు. తర్వాత అతనే తన యజమానికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. గమనించిన తోటి కార్మికులు రక్తపు మడుగులో ఉన్న సరితాదేవిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.
పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కరణ్‌కోట్ పోలీసులు రిషిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని కస్టడీ కోసం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

# పారదర్శకంగా గనుల వేలం

**వికారాబాద్, ప్రభాతవార్త :** గనులు వేలం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధికా రులకు సూచించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు వికారాబాద్ జిల్లాలో వేలం ప్రక్రియ కోసం జిల్లా స్థాయి ప్రీఆక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో గుర్తించిన గనులు, ఖనిజ వనరుల వేలానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు. వేలానికి ప్రతిపాదించిన ప్రాంతాల వివరాలు, భౌగోళిక సమాచారం, రిజర్వ్ ధరల నిర్ణయం, వేలం షెడ్యూల్, నిబంధనలు, పర్యావరణ అనుమతులు, భద్రతా చర్యలు, ఇతర పరిపాలనా అంశాలను పరిశీలించారు. గనుల వేలం ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలు, చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ప్రభుత్వానికి గరిష్ట ఆదాయం సమకూరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మోమిన్ పేట్, బంట్వారం, నవాబ్ పేట్, పూడూర్, బొంరాస్ పేట్ మండలాల్లో మైనింగ్ కు సంబందించిన స్థలాలను త్వరిత గతిన సర్వే చేయించి రిపోర్ట్ సబ్మిట్ చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాఅదనపు కలెక్టర్ వెంకటాచారి, డీఆర్ఓ అనిత, రెవెన్యూ అధికారి వాసు చంద్ర, ఏడి సర్వే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## నాయకులను నిలదీయండి : పేదలకు సిపిఐ పిలుపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిత్యావసర సరుకుల, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ చార్జీలు, విద్యా-వైద్య ఖర్చుల ధరల పెరుగుదలను నిరసిస్తూ జిల్లా సిపిఐ కమిటీ కార్యదర్శి ఉమామహేశ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బోసు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అచ్చే దిన్ అభివృద్ధి పేరుతో గొప్పలు చెప్పిన మోడీ నేడు ధరల విషయంలో ఒక్క మాట కూడ మాట్లాడటం లేదని విమర్శించారు. జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వచ్చే నాయకులను సిపిఐ ప్రశ్నించాలని సూచించారు. కలెక్టరేట్‌లో డిఆర్ఓ మాలతికి సిపిఐ నాయకుల బృందం వినతిపత్రాన్ని అందజేసింది.

## అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల విక్రేత అరెస్ట్

**షాద్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త :** ఈగిల్ ఫోర్స్ తెలంగాణ, షాద్‌నగర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల విక్రేతను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుడు మోహిత్ కుమార్ (32)గా గుర్తించారు. అతడు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పెట్ బషీరాబాద్‌కు చెందినవాడు. నిందితుడి వద్ద నుంచి 20 గ్రాముల ఎండీఎంఏతో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, మోహిత్ కుమార్ గతంలో కూడా గంజాయి మరియు మాదకద్రవ్యాల కేసుల్లో అరెస్టై జైలు శిక్ష అనుభవించాడు. బెంగళూరులో పరిచయమైన డ్రగ్ సరఫరాదారుల ద్వారా ఎండీఎంఏను కొనుగోలు చేసి తెలంగాణలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇటీవల బెంగళూరు నుంచి 20 గ్రాముల ఎండీఎంఏను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొస్తుండగా, విశ్వసనీయ సమాచారంతో ఈగిల్ ఫోర్స్ బృందం షాద్‌నగర్ పోలీసుల సహకారంతో అతడిని పట్టుకుని డ్రగ్‌ను స్వాధీనం చేసుకుంది. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఈగిల్ ఫోర్స్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోహిత్ కుమార్ గతంలో గంజాయి, మాదకద్రవ్యాల కేసుల్లో అరెస్టై జైలు శిక్ష అనుభవించాడు.



స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలు

చర్లపల్లి జైలులో ఉన్న సమయంలో బెంగళూరుకు చెందిన కొందరు డ్రగ్ సరఫరాదారులతో పరిచయం ఏర్పడగా, విడుదల అనంతరం వారి నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి తెలంగాణలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ నెల 9న బెంగళూరులో 20 గ్రాముల ఎండీఎంఏను కొనుగోలు చేసిన నిందితుడు, 10న హైదరాబాద్‌కు వస్తుండగా విశ్వసనీయ సమాచారంతో ఈగిల్ ఫోర్స్ బృందం షాద్‌నగర్ వద్ద అడ్డగించి పట్టుకుంది. స్వాధీనం చేసుకున్న డ్రగ్ విలువ లక్షల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.



ఇందోల్ గ్రామంలో గ్రామసభలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి చంద్రప్ప

## విద్య, వైద్యం, రోడ్డు భద్రత, పారిశుద్ధ్యంపై అవగాహన

**కోట్‌పల్లి, జూన్ 10, ప్రభాతవార్త;** విద్య, వైద్యం, రోడ్డు భద్రత, పారిశుద్ధ్యంపై అవగాహన ఎంతో అవసరమని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. బుధవారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని ఇందోల్ గ్రామ పంచాయతీలో "99 రోజుల ప్రజాపాలన ప్రణాళిక"లో భాగంగా గ్రామ సర్పంచ్ చంద్రకళ అధ్వర్యంలో పలు కీలక తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్యం, రోడ్డు భద్రత, పారిశుద్ధ్యం, పశువుల పోషణ జల సంరక్షణ వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని పాఠశాల కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచడం, మంచినీటి ట్యాంకును శుభ్రపరచడం, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులు పెరగకుండా గ్రామంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండటం లేదా విద్యుత్ వైర్లు వేలాడుతూ కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని, ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండకూడదని సూచించారు. అలాగే ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే గ్రామ ప్రజలందరూ పరిశుభ్రత పాటిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలన్నారు. గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు తమ సమస్యలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, గ్రామపంచాయతీ కార్యదర్శి వాటిని నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపిస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని వారు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నికాత్ ఉన్నిసా, గ్రామ పెద్దలు, కానిస్టేబుల్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులు నిబంధనలకు అనుగుణంగా సేవలు అందించాలి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లో గల ధన్వంతరి గ్రామీణ వైద్యుల భవనంలో ధన్వంతరి గ్రామీణ వైద్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరై గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను వెంటనే ఆదుకునే బాధ్యత గ్రామీణ వైద్యులపై ఉంటుందని, ప్రాథమిక వైద్య సేవలను నాణ్యంగా అందించాలని కోరారు. ధన్వంతరి గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, 10వ వార్డు కౌన్సిలర్ నడికుడ శ్రావణి, బాలరాజు గౌడ్, శ్రీశైలం గౌడ్, శ్రీను నాయక్, కుమారస్వామి గౌడ్, యాదగిరి యాదవ్, మంగ అశోక్, మంగ మధు ముదిరాజ్, ధన్వంతరి గ్రామీణ వైద్యుల అధ్యక్షుడు రాజు, నెహ్రూ నాయక్, బుచ్చిబాబు, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

### పనిచేయని బిఎల్ఓలను తక్షణమే తొలగించాలి

**అత్తాపూర్ జూన్ 10,ప్రభాతవార్త :**
కొన్ని బూతులలో బిఎల్ఓలు సరిగా పని చేయడం లేదని వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని పలువురు బిజెపి నేతలు ఆర్డిఓ శ్రీధర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం కార్యాలయంలో ఆర్డిఓ శ్రీధర్‌ను రంగారెడ్డి జిల్లా ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లేష్ యాదవ్, బిజెపి ఆఫీస్ సెక్రటరీ విజయ్ కుమార్, హరికిషన్, బిజెపి డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్, మల్లేష్ చారిలు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఎల్ఓను కేటాయించిన బూతులలో కొంతమంది బిఎల్ఓలు సరిగా పనిచేయడం లేదని బిఎల్ఎ-2 చెప్పడం జరుగుతుందని వివరించారు. కావున వారిని తక్షణమే బిఎల్ఓ నుండి తొలగించి కొత్త వాళ్లను నియమించాలని కోరారు. కొంతమంది బిఎల్ఓకి మ్యాపింగ్ అవగాహన ఎలా చేయాలో కూడా తెలియడం లేదని ఎస్ఐఆర్ కార్యక్రమం చాలా పెద్ద యజ్ఞం కాబట్టి బిఎల్ఓ చాలా ముఖ్యమైన భూమిక పోషిస్తారని అవగాహన ,చదువుకున్న వారిని నియమించాలని ఆర్డీఓను కోరారు.

### వైద్యసంఘాల ప్రమేయం లేకుండా బదిలీలు

**గోషామహల్, జూన్ 10ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ,వైద్య, ఆరోగ్యశాఖలో 2026 జనరల్ బదిలీలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, ఏ సంఘాల ప్రమేయం లేకుండా నిర్వహిం చడం పట్ల సీనియర్ వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్ని వైద్య సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినప్పటికి, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, 2024సంవత్సరం అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆఫ్‌లైన్‌కు బదులుగా ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా, విజయవంతంగా బదిలీల ప్రక్రియను పూర్తి చేసినందుకు ప్రభుత్వానికి అభినందలు తెలిపారు. ముఖ్యంగాజి.ఓ నెంబర్ 38 ప్రకారం ప్రాధాన్యత క్రమానికి, ప్రాముఖ్యతనిస్తూ దాదాపు 80శాతం వైద్య, సిబ్బందికిమేలు కలిగే విధంగా బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రిదామోదర్ రాజనర్సింహా, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్‌చోంగ్తు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కమిటి సభ్యులకు ప్రత్యేక సీనియర్ వైద్యులు శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి

**కొడంగల్, జూన్ 10, ప్రభాతవార్త:**
ప్రతి రాజకీయ పార్టీ ప్రతి పోలింగ్ బూత్‌కు బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించుకోవాలని జిల్లా అడిషనల్(రెవెన్యూ) కలెక్టర్ వెంకటచారి సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(సర్)2026కు సంభందించి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, తహశీల్దార్‌తో సర్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పార్టీ తరపున ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించాలని తెలిపారు. ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాల తయారీ, సవరణలకు పూర్తి అధికారాన్ని కలిగి ఉందన్నారు. ఓటర్ల జాబితా యొక్క సమగ్రతను కాపాడడానికి, కమీషన్ ప్రతి ఎన్నికకు ముందు లేదా అవసరాన్ని బట్టి ఓటరు జాబితా సవరణను నిర్వహిస్తుంది, ప్రస్తుతం ప్రజలు తరుచుగా వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్తండడం వల్ల ఓటరు జాబితాలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. దీనివల్ల ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాల్లో నమోదు కావడం, మరణించిన ఓటర్ల పేర్లు తొలగించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. అందువల్ల అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండి, అనర్హులైన వారి పేర్లు తలగించబడేలా నిర్ధారించేందుకు చేపట్టే విస్తృత స్థాయి ఓటరు జాబితా పునఃపరిశీలన కార్యక్రమాన్నే ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సర్ సర్ కార్యక్రమం ఈనెల 25న ప్రారంభమై 1అక్టోబర్‌న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగుస్తుందన్నారు. ఈనెల 25 నుంచి జులై 27 వరకు ఇంటింటి గణన కార్యక్రమం కొనసాగుతుందని, అలాగే జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణతో పాటు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ 31 జులై నుండి అగష్టు 30 వరకు ఉంటుందన్నారు. చేర్పులు, నోటీసుల జారీ, తొలగింపులు, సవరణల విచారణ సెప్టెంబర్ 28 వరకు ఉంటుందన్నారు. తుది ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 1న ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# వాగులను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

**మొయినాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులు, వంకలను అక్రమంగా ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని తోల్కట్ట గ్రామ శివారులో గుండ్ల వాగును కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి మట్టి పూడ్చి భారీ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ అధికారులు బుధవారం సంఘటన స్థలానికి చేరుకుని ఆక్రమణలను పరిశీలించారు. వివరాల్లోకి వెళితే, తోల్కట్ట గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 159, 161, 163, 175, 177ల మధ్యగా ప్రవహిస్తున్న గుండ్ల వాగు పరిధిలో కొందరు వ్యక్తులు వాగు సహజ ప్రవాహానికి అడ్డంకులు కలిగే విధంగా మట్టి పూడ్చి పెద్ద ఎత్తున కాంపౌండ్ వాల్ నిర్మించినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో మండల రెవెన్యూ అధికారులు, సర్వే శాఖ సిబ్బంది, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించారు. సర్వేలో వాగు భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు వెంటనే చర్యలకు దిగారు. రెండు జేసీబీల సహాయంతో సుమారు 300 మీటర్ల పొడవున నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను కూల్చివేసి వాగు పరిధిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న అధికారులు ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. తహసీల్దార్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, వాగులు, వంకలు, చెరువులు ప్రజల ఆస్తి అని, వాటిని ఆక్రమించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. సహజ జలమార్గాలను మూసివేయడం వల్ల వర్షాకాలంలో వరద ముప్పు పెరిగే అవకాశం ఉందని, ప్రజల ప్రాణాలు మరియు ఆస్తులకు నష్టం కలిగే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అందుకే ప్రభుత్వం ఇటువంటి ఆక్రమణలపై రాజీ



కాంపౌండ్ వాల్‌ను జేసీబీలతో తొలగింపు..

లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. మొయినాబాద్ మండలం ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ యజమానులు భూములు కొనుగోలు చేసే ముందు పూర్తి స్థాయిలో రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులు, వంకలు లేదా ఇతర ప్రజా ప్రయోజన భూములపై ఎలాంటి ఆక్రమణలు జరిగినా వాటిని ఉపేక్షి ంచబోమని స్పష్టం చేశారు. అక్రమ ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఎవరైనా ఆక్రమణల సమాచారాన్ని అధికారులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జలజ, ఇరిగేషన్ శాఖ ఏఈలు శివకుమార్, వరప్రసాద్, తోల్కట్ట జీపీఓ గణేష్, రెవెన్యూ సిబ్బంది జానకిరామ్, రవి, నరసింహ, అజీజ్, రామకృష్ణ, రాజు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్-సీట్ బెల్ట్ వాడకుంటే ప్రాణాలకు ముప్పే..

### ఒక్కో సిసి కెమేరా వందమంది పోలీసులతో సమానం... రోడ్డు భద్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యవసరం

**మల్టీ జోన్-2 ఐజీ షానవాజ్**

**మోమిన్‌పేట్, జూన్ 10. ప్రభాతవార్త:** వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్-సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలని లేని పక్షంలో ప్రానాలకే ముప్పని హైదరాబాద్ మల్టీ జోన్-2 ఐజీ షానవాజ్ పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేట్ ఠాణాలో 125, సీసీ కెమేరాల ప్రార్భఓత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల వ్యవస్థను ఐజీ షానవాజ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, నేరాల నియంత్రణ, ట్రాఫికన పర్యవేక్షణ మరియు శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమేరాలు కీలకపాత్ర పోషిస్తాయని



సిసి కెమేరాలను ప్రారంభిస్తున్న ఐజీ,కలెక్టర్,ఎస్పీలు.

అలాగే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసుశాఖ మరింత సమర్ధవంతంగా పనిచేయగలదని తెలిపారు. ఐజీతో పాటు ముఖ్య



కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

అతిధిగా పాల్గొన్న వికారాబాద్ జిల్లా పాలనాధికారి దీపక్ తివారి మరియు జిల్లా ఎస్పీ స్నేహ్ మెహ్రా లు పాల్గొన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమేరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని, వాహనాలు నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని వారు సూచించారు. ఈ సీసీ కెమేరాలు నేరాల నివారణకు, నిందితుల గుర్తింపుకు మరియు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, మోమిన్‌పేట సీఐ వెంకట్, ఎస్ఐ భరత్ భూషణ్, నవాబుపేట ఎస్ఐ, మర్పల్లి ఎస్ఐలు, తహసీల్దార్ రవిందర్, ఏఎంఆర్ఐ గోవర్ధన్ గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వ్యాపారస్తులు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**చాంద్రాయణగుట్ట, జూన్ 10, ప్రభాతవార్త :** వెసవి సెలవుల తరువాత ఈనెల 15వ తేదీ సోమవారం నుండి ప్రభుత్వ, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 2026-27 విద్యా సంవత్సరం తొలి రోజు నుండే విద్యార్థుల చేతు ల్లో పాఠ్య, రాత పుస్తకాలు ఉండాలన్న లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాల పంపిణీని ఆయా జోన్ల డిప్యూ టీ ఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు ప్రారంభించారు. పుస్తక పంపిణీ కేంద్రాలను పరిశీలించి అక్కడి ఉద్యోగు లకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

బహదూర్‌పురా-1 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్(డిప్యూటీ ఐఓఎస్) పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి తన పరిధిలోని 15 ఉన్నత, 30 ప్రాథమిక పాఠశాలలో చదువు కుంటున్న సుమారు మూడు వేల మంది విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీని ప్రారంభించారు. త్వరలో యూనిఫారమ్, షూలు, తొమ్మిది వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేస్తామన్నారు. తొలిరోజు దారుల్‌షిఫా ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల ఇంచార్జ్ సద్గుణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డిలు పాఠ్య, నోటు పుస్తకాలను స్వీకరించారు. ఈనెల 15న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించ నున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికాంత్, రమ, సమగ్ర శిక్ష సిబ్బంది కౌసల్య, దీపిక, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

**ఆయా, వాలంటీర్లకై దరఖాస్తుల స్వీకరణ**

బహదూర్‌పురా-1 పరిధిలో తొమ్మిది పూర్వ ప్రాథమిక పాఠశాలలు



పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ వెంకట్‌రెడ్డి

మంజూరైనట్లు డిప్యూటీ ఐఓఎస్ వెంక ట్‌రెడ్డి వెల్లడించారు. మీరాలం మండి, బజార్ ఏ ఘూస్నీ, రికాబ్‌గంజ్, మిరాలం ట్యాంక్, రామ్నాస్ పురా, కుమ్మరివాడి, బజార్ ఏ నూర్ ఉమ్రా, ఇరానీ గల్లి, ఖాజా నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (పిఎస్) ఆంగ్ల మాధ్యమంలో ఎల్‌కెజి, యుకెజి తరగతులను ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభించను న్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నా యి. ఆయా పాఠశాలల నిర్వాహణకు అవసరమైన వాలంటీర్లు, ఆయాల నియామకం కోసం ఇప్పటికే దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికు లైన వారు దారుల్‌షిఫాలోని డిప్యూటీ ఐఓఎస్ కార్యాల యంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు అదేరోజు చివరి రోజని పేర్కొన్నారు.

# 5 కి.మీ పరిధి వారికే 2బిహెచ్‌కే ఇళ్ల కేటాయింపు

**దుండిగల్, జూన్ 10, ప్రభాతవార్త**

డబుల్ బెడ్‌రూం కాలనీల్లో కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు తప్పనిసరిగా నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతం అధికారులను ఆదేశించారు. ఇళ్లు కేటాయించుకు న్నప్పటికీ కాలనీల్లో నివసించని వారికి మరోసారి నోటీసులు జారీ చేయాలని, స్పందించకపోతే కేటాయింపులు రద్దు చేసి ఇతర అర్హులకు ఇళ్లు అందజేస్తామని స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ ప్రాంతాల్లోని 2బిహెచ్‌కే కాలనీలను సందర్శించిన ఆయన నిర్మాణ పనులు, మౌలిక వసతుల పురోగతిని పరిశీలిం చారు. దుండిగల్ ఫేజ్1 కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు, వారికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. దుండిగల్ ఫేజ్ 2లో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన గౌతం, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర మౌలిక వసతుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇకపై 2బిహెచ్‌కే ఇళ్లను ఆయా కాలనీలకు సమీపంలోని 5 కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఈ మేరకు గండిమైసమ్మ ప్రాంతంలో లబ్ధిదారుల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న, సొంత ఇల్లు లేదా ఇంటి స్థలం లేని ఎల్2 జాబితాలోని అర్హులను గుర్తించేందుకు సర్వే కొనసాగుతోం దన్నారు. సర్వే వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేసి, ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



అనంతరం యుద్ధప్రాతిపదికన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఇళ్ల కేటాయింపులు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం. చైతన్యకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి. రమణారెడ్డి, జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో సర్ శిక్షణలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

## సర్ విజయవంతంలో వారి పాత్రే కీలకం

**కొడంగల్, జూన్ 10, ప్రభాతవార్త:**
కాంగ్రేసన పార్టీ ఓటర్లను తొలగించేందుకు కేంద్రం కక్ష్య కట్టిందని సర్ తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని రాఘవేంద్ర గార్డెన్‌లో కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అద్వర్యంలో కొడంగల్ నియోజకవర్గ స్థాయి సర్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పార్టీ పరిశీలకులు వినయ్‌రెడ్డి, వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల డిసిసి అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్, ప్రశాంత్‌కుమార్‌రెడ్డిలు ముఖ్య అతిధులుగా హజరైయ్యారు. ఈ సందర్భంగా సర్ రాష్ట్ర కన్వీనర్ టీ.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల తొలగింపుతోనే ఇటీవలే జరిగిన తమిళనాడు, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు మమతబెనర్జి, స్టాలీన్‌లు ఎమ్మెల్యేగా ఓటమి పాలు కావడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమీషన్ ముసుగులో అర్హుల ఓట్లను తొలగించేందుకు సర్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకొని కాంగ్రేస్ ఓటర్లను తొలగించేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఈ కుట్రలను అడ్డుకునే బాధ్యత కాంగ్రేస్ పార్టీ బీఎల్‌ఓలపై ఉందని అన్నారు. సర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా పనిచేయాలని అన్నారు. బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు సమన్వయంతో పని చేయాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదును కూడా చేపట్టాలన్నారు . ఇంటింటి సర్వేలో పాల్గొనాలని, నిర్లక్ష్యం చేయరాదన్నారు. అలాగే కాంగ్రేస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా రాజ్యాంగ బద్దంగా వచ్చిన నిజమైన ఓటు హక్కును తొలగించేందుకు అధికారం లేదన్నారు. సర్ కార్యక్రమం ద్వారా ఓటర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అర్హులను ఓటర్లకు న్యాయం చేయాఇల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, డబుల్ ఓటర్ల తొలగింపుకు కాంగ్రేస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రేస్ నాయకులు పనిచేయాలన్నారు. ఈనెల 25 నుంచి జులై 24వరకు బీఎల్‌ఓలతో పాటు బీఎల్‌ఏలు ఇంటింటికి వెళ్ళి ఓటర్ల వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం పార్టీ పరిశీలకులు వినయ్‌రెడ్డి ప్రత్యేక పుస్తకాన్ని అవిష్కరించి సర్ కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల గ్రంధాలయ సంస్థల చైర్మేన్‌లు రాజేష్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యుసుఫ్, కోస్గీ మున్సిపల్ చైర్మేన్ నాగులపల్లి నరేందర్, కొడంగల్ మున్సిపల్ వైస్‌చైర్మేన్ శంకర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, ఉమ్మడి కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి, మద్దూర్, బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్, గుండుమాల్, కొత్తపల్లి మండలాలకు చెందిన మండల పార్టీ అద్యక్షులు, అవుఇ శేఖర్, నర్సిములుగౌడ్, రఘువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రావు, ఆనంద్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, సాయిలు, సత్తిరెడ్డి, కొడంగల్ నయ్యూం, దాములతో పాటు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, టీచర్లు

## ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

**ఘట్‌కేసర్, జూన్ 10, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విధ్యాభోధనతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారని ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమిరెడ్డి పాపిరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు నమోదు చేశారు. జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది బాలాజీనగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, కొండాపూర్ రోడ్డులో ఉన్న వలస కార్మికులు, కూలీల ఇళ్ల వద్దకు వెళ్లి సర్కారు బడుల్లో కల్పిస్తున్న సదుపాయాలు, విద్యాభోదన, ఉచిత పథకాలను తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌళికసదుపాయాలు, నిష్ణాతులైన టీచర్లతో ఇంగ్లీ మాధ్యమంలో విద్యాభోధన, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్నభోజనం, కంప్యూటర్ విద్యా, క్రీడలు, యోగ, డిజిటల్ అక్షరాస్యత, సాంస్కృతి విద్యా, నాణ్యమైన చదువు అందుతుందని వివరించారు. ఇడబ్ల్యుఎస్‌కాలనీ ప్రాథమిక, హరిజనవాడ ప్రాథమిక, జిపి రోడ్డు పూర్వ ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పిల్లలను చేర్చుకుంటున్నామని తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా ఉచితంగా నాణ్యమైన విద్యా అందిస్తున్న సర్కారు బడులకు తమ పిల్లలను పింపించాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లో టీచర్లు బడిబాట ర్యాలీ జరిపారు. ఈకార్యక్రమంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు జి.విజయ, ఉపాధ్యాయులు రామానుజచారీ, యశ్పాల్, ప్రాథమిక పాఠశాల టీచర్లు శైలజ, హైమవతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**న-రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**అత్తాపూర్ జూన్ 10,ప్రభాతవార్త :**
వర్షాకాలంలో ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నాలాలపై ఎక్కడైనా కప్పులు లేకుండా ప్రమాదకరంగా ఉంటే గుర్తించి జీహెచ్ఎంసి అధికారులు వాటిని బాగు చేయాలన్నారు . జలమండలికి చెందిన పనులు అయితే ఆ శాఖ అధికారులకు తెలియజేయాలని చెప్పారు. రోడ్ల పై నీరు నిల్వ ఉండే చోట్ల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వాహనదారులు, ప్రజలు, పాదచారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు ఉప్పడే సందర్భాలలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఎక్కడ ఎవరు నిరక్ష్యంగా ఉండకూడదని సూచించారు. హైడ్రా, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, ప్రాజెక్ట్ విభాగ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన శ్రీలత, శ్రీనివాస్‌రెడ్డి

**మేడ్చల్, జూన్ 10. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ శ్రీలత ఆమె భర్త శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తన రాజీనామా పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ యాదవ్‌కు పంపించారు. గత ఎంపీ ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరామని, కానీ పార్టీలో చేరిన నాటి నుండి మాకు ఎలాంటి గౌరవం, గుర్తింపు ఇవ్వకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా గ్రామాభివృద్ధి

**పూడూరు, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రజల సహకారంతో ప్రణాళికాబద్ధంగా గ్రామాభివృద్ధికి కృషిచేస్తానని సర్పంచ్ టి. దయాకర్ పేర్కొన్నారు.99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా గ్రామంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు.గ్రామంలో మంచినీటి కొరత రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.మంచినీటి పైప్‌లైన్ లీకేజీలపై పంచాయతీ సిబ్బంధి పర్యవేక్షణ ఉండాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన కొనసాగుతుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఆపాఠశాలల్లోనే చదివించే విధంగా చూడాలన్నారు.విద్యుత్తు సరఫరాలో అంతరాయం రాకుండా వైర్లను సరిచేయాలని సంబంధిత అధికారులను కోరారు.గ్రామంలో అంతర్గత రోడ్లు వేయించేందుకు కృషిచేస్తానని వివరించారు.గ్రామంలో ఎస్ఐర్ (సర్)ద్వారా చేపట్టే ఓటరు జాబితా సవరణలో ప్రతిఒక్కరు తమ ఓటును నమోదు చేయించుకోవాలని సూచించారు.అదేవిధంగా పూడూరు కంకల్,కడ్మూరు,కండ్లపల్లి,మేడికొండ,మంచన్‌పల్లి,తదితర గ్రామపంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి.ఈ కార్యక్రమాల్లో మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు ఖిజర్‌పాష,సర్పంచులు వీరేశం,శివశంకర్,ప్రత్యేకాధికారులు తహశీల్దారు విజయ్‌కుమార్ ,పంచాయతీరాజ్ ఎఇ మధుసూధన్,ఎంపిడిఒ పాండు,ఎంపిఒ సుందర్.ఉపసర్పంచ్ విజయ్,వార్డు సభ్యులు కిష్టం రవి,అనంతయ్య,పంచాయతీ కార్యదర్శులు,జిపిఒలు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అంజయ్య**

**తలకొండపల్లి, జూన్ 10, ప్రభాతవార్త:**

జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఇవ్వవలసిన పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య అన్నారు. బుధవారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ కూలీలు, మెట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలకు చెల్లించవలసిన పెండింగ్ బిల్లులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసివేసే ఎందుకు చట్టంలో అనేక మార్పులు తీసుకొస్తుందన్నారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని తీసివేసి రాంజీ చట్టాన్ని తెస్తుందని దీంతో కోట్లాదిమందికి కావాల్సిన బడ్జెట్లో 2,50,000 కోట్లు అవసరం ఉంటే కేవలం 90000 కోట్లు మాత్రమే బడ్జెట్లో కేటాయించారు అన్నారు. కూలీల ఫోటోల 6 గంటల నుంచి 9 గంటల వరకు ఉండవలసి వస్తుందని సిగ్నల్స్ లేక ఫోటోలు రాకపోవడం వలన కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్లు సీనియర్ మెట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. గతంలో పనిచేసే కూలీలకు వాటర్ బిల్లు లయన్స్ గడ్డపారకు సంబంధించిన బిల్లులు ఇచ్చే వారిని ప్రస్తుతం అవన్నీ రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. నెలనెలకు రావు, వారానికి రావలసిన బిల్లులు నెలలు గడుస్తున్నా రావడంలేదని ప్రతికూలికి రోజువారి కూలికి 800 రూపాయలు చెల్లించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల కమిటీ అధ్యక్షురాలుగా మంజుల ప్రధాన కార్యదర్శి బి శివ ఉపాధ్యక్షులు ఎం శ్రీను జంగయ్య బాలచందర్ సహకార దర్శులు రవీందర్ హనుమ శీను శశికళ మరియు కమిటీ సభ్యులుగా హైమావతి ఆంజనేయులు శ్రీరామ్ శీన్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల సమన్వయకర్నాల్ గుమ్మడి కుర్మయ్య తోపాటు సిఐటి నాయకులు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలి

**తలకొండపల్లి, జూన్ 10 ,ప్రభాతవార్త:**

గ్రామంలో అన్ని రకాల అభివృద్ధి పనులు పూర్తి చేసుకునేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని రాంపూర్ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ అన్నారు. బుధవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సర్పంచ్ నిర్మల అధ్యక్షతన గ్రామ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రకాల అభివృద్ధి పరచుకునేందుకు గ్రామంలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు పూర్తి బాధ్యత తీసుకోవాలని చెత్త రోడ్లు విధులపై వేయరాదని ఆమె తెలిపారు. గ్రామంలోని తిమ్మాయకుంటలో చెత్త వేయడం వల్ల కుంటలోని చేపలు మృతి చెందుతున్నాయని, కావున చెత్తను తదితర వస్తువులను డంపింగ్ యార్డ్ ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వట్టేలా నిర్మల శ్రీశైలం యాదవ్, ఉపసర్పంచ్ సప్పిడి ఆంజనేయులు, కార్యదర్శి రవీందర్ భాస్కర్ రెడ్డి అగ్రికల్చర్ ఆఫీసర్ అనిత ఏం నెంబర్ రేవతి, మత్స్యకార సొసైటీ కార్యదర్శి శేఖర్ ముదిరాజ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు రామయ్య షర్ఫుద్దీన్ హర్మోన్ రెడ్డి పెంటయ్య పకీర సలీం మహేష్ రమేష్ జంగయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## బిజెపి కుట్రలను తిప్పికొడదాం

**....డిసిసి అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్**

**పెద్దేముల్, జూన్ 10, ప్రభాతవార్త:** సర్‌తో ఓటు ఎలక్షన్‌తో సీటు చోరీ చేస్తున్న బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ మాట్లాడుతూ ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్ నామినేషన్ తిరస్కరణ ముమ్మాటికి రాజకీయ కుట్రేనని మండిపడ్డారు. ఎన్నికల సంఘం పూర్తిగా నిష్పాక్షికంగా పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. నామినేషన్ తిరస్కరణ, ఆమోద ప్రక్రియలో ఏవైన లోపాలు జరిగి ఉంటే వాటిపై స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షికంగా జరగడం దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమని అన్నారు.

## విట్యాల గ్రామంలో కుక్కల స్వైర విహారం

**పసి బాలుడు మీద దాడి చేసి గాయపరిచిన కుక్కలు**

**సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్తుల వేడుకోలు**

**షాద్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త :** ఫరూక్ నగర్ మండల పరిధిలోని విట్యాల గ్రామంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బుధవారం గ్రామానికి చెందిన బైరమోని శంకర్



కుమారుడైన ప్రజ్వల్ అనే పసి బాలుడు మీద కుక్కలు దాడి చేసి గాయపరిచాయి దీంతో బలుడికి తీవ్ర గాయాలు అయ్యాయని బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కుక్కలు పొలాల వద్ద ఉన్న మేకల మీద దూడల మీద దాడి చేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. కావున సంబంధ అధికారులు స్పందించి కుక్కల బెడదల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలకు హర్షవర్ధన్ ఎంపిక

**..హర్షవర్ధన్‌కు ఆర్‌బిఓఎల్ సీఈఓ భారీ ఆర్థిక చేయూత**

**...క్రీడాకారులకు ఎల్లప్పుడు అండగా ఉంటా: బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి**

**పెద్దేముల్, జూన్ 10, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన జాతీయ సెయిలింగ్ క్రీడాకారుడు ఎర్ర హర్షవర్ధన్ ఈ నెల 24వ తేది నుంచి మలేషియాలోని లంఖానిలో నిర్వహించనున్న అంతర్జాతీయ సెయిలింగ్ పోటిలకు ఎంపికయ్యాడు, అయితే హర్షవర్ధన్ బెంగుళూర్‌లోని ఆర్మీబాయి స్టోర్స్‌లో కంపెనికి 9వ తరగతిలోనే ఎంపికై అక్కడే ఉంటు గత ఐదు సంవత్సరాలుగా సెయిలింగ్ క్రీడలో కోచింగ్ తీసుకుంటు జాతీయ స్థాయిలో అనేక పథకాలు సాధించి ఇండియన్ సెయిలింగ్ అథ్లెట్‌గా నిలిచాడు. అయితే అంతర్జాతీయ పోటిల్లో పాల్గొనడానికి తండ్రి ఎర్ర చిన్నఎల్లప్ప (యేసు) రైతు కావడంతో ఆర్థిక భారంతో పోటిల్లో పాల్గొనేందుకు ఇబ్బంది పడుతున్న సంగతి గాజీపూర్ సర్పంచ్ పట్లోల్ల హేమలత లాల్‌రెడ్డి, గ్రామ పెద్దల ద్వారా తెలుసుకున్న ఆర్‌బిఓఎల్ సంస్థ సిఇఒ ఎర్ర హర్షవర్ధన్‌లోని ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ పోటిల్లో పాల్గొనడానికి అవసరమైన రూ.150000లను చెక్కు రూపంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హర్షవర్ధన్ మలేషియాలో జరిగే పోటిల్లో స్వర్ణపథకం సాధించి గాజీపూర్ గ్రామంతో పాటు తాండూరు ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని



చెక్కును అందజేస్తున్న సిఇఒ శ్రీనివాస్‌రెడ్డి

ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాజీపూర్ సీనియర్ నాయకులు లాల్‌రెడ్డి, విద్యావేత్త పర్యాద రామక్రిష్ణ, గ్రామపెద్దలు ప్రకాష్‌రెడ్డి, నసీర్, నర్సిములు, లాలప్ప, భద్రేశ్వర దేవస్థానం మాజీ చైర్మెన్ పటెల్ కిరన్‌కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ జుంటుపల్లి వెంకట్, కాంగ్రెస్ నాయకులు రాజుగౌడ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు



**....క్రీడల ద్వారా సమాజంలో ఐక్యత, స్నేహభావం**

**...తాండూరు పట్టణ కౌన్సిలర్ ఉప్పరి స్వరూప**

**పెద్దేముల్, జూన్ 10, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో దాగియున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు క్రీడల పోటిలు ఎంతో దోహదపడతాయని మాజీ జడ్‌పిటిసి, ప్రస్తుత తాండూరు పట్టణ కౌన్సిలర్ ఉప్పరి స్వరూప అన్నారు. బుదవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మాస్టర్ మైండ్ పాఠశాల డైరెక్టర్ ఉప్పరి మల్లేశం అధ్వర్యంలో నిర్వహించిన పీపీఎల్ క్రికెట్ టోర్నమెంటును కౌన్సిలర్ ఉప్పరి స్వరూప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పరి స్వరూప మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల ద్వారా సమాజంలో ఐక్యత, స్నేహభావం పెంపొందుతాయని అన్నారు. అంతేగాకుండా క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యాని కలిగిస్తాయని అన్నారు. భవిషత్తులో మరింత పెద్దస్థాయిలో క్రీడా పోటిలు నిర్వహించేందుకు నిర్వహకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కన్వీనర్ యండి.రియాజ్, జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, శోభరాణి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా, గ్రామ కమిటి అధ్యక్షుడు డివై నర్సిములు, రవితేజ సాగర్, ఇందూరు సర్పంచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**కీసర,జూన్10,ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు.బుధవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్‌లో రూపాయలు 55 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి,పంబాల రమేష్,వంగేటి పర్వత్‌రెడ్డి,మంచాల ప్రవీణ్‌కుమార్,పొట్ట శ్రీశైలం,భూమయ్య యాదవ్,బాలరాజు యాదవ్,అన్నంరాజు సురేష్,పొట్ట విఘ్నేశ్వర్,మహిపాల్‌రెడ్డి, సోమిరెడ్డి,వినోద్, సుమతి,



ఎలిఫెంట్ కాలనీలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

హరిదాసన్,కాలనీ అధ్యక్షులు వాసు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ స్కూల్స్‌ను రద్దు చేయాలి



మున్సిపల్ చైర్మన్ జాము రవికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడి టీచర్స్, సిఐటియు నాయకులు

**శామీర్‌పేట, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల ఉనికిని దెబ్బతీయటానికే ప్రభుత్వం ప్రీ-ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందని, వాటిని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా జి.సునీత డిమాండ్ చేశారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జాము రవిని పలువురు అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు, సిఐటియు నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాలకు ఎసరు పెట్టె కార్యక్రమానికి పూనుకుందని విమర్శించారు. ప్రీ-ప్రైమరీ స్కూల్స్‌ను పిఎం శ్రీవిద్యను ప్రవేశ పెడుతున్నారని అన్నారు. అంగన్‌వాడి కేంద్రాలకు నష్టం కల్గించే విధంగ ప్రీ-ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సునీతతో పాటు అంగన్‌వాడి టీచర్స్ యూనియన్ నాయకురాలు అనిత, పలువురు అంగన్‌వాడి టీచర్లు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారు



మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ డిమాండ్

**కొందుర్గు, జూన్ 10.** లక్ష్మీ మ్‌దేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి ఎప్పటిలోగా పూర్తి చేస్తారో, చెప్పాలని రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డిని మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఆమె మండల పరిధిలోని రేగడి చిలుకమర్రి, ఉమ్మెంట్యాల, కొందుర్గులలో ఎంపీ లార్డ్ నిధులతో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్లను ఆమె పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు . అనంతరం స్థానిక మాజీ ఎంపీటీసీ నిర్మల లక్ష్మయ్య గౌడ్ ఇంటికి చేరుకుని ఇటీవల శాస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య గౌడ్ ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అలుపెరుగని నాయకుడు, అభివృద్ధి కార్య అధ్యక్షులు, మహనీయుడు, నిత్య సేవకుడు,దేశం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రియతమా నాయకులు నరేంద్ర మోడీ భారత ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె నియోజకవర్గ ప్రజల తరఫున భారత ప్రధాని నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు తెలియజేశారు. గత 12 సంవత్సరాల క్రితం ఆర్థిక అభివృద్ధిలో 12 శాతం ఉన్న భారత్ ను , ప్రస్తుతం జపాన్ దేశాన్ని అధిగమించి భారత ఆర్థిక అభివృద్ధి నాలుగు శాతానికి తీసుకొచ్చిన ఘనత ప్రధానికి దక్కిందని కొనియాడారు. త్వరలోనే ఎన్డీఏ ప్రభుత్వ 12 ఏళ్ల పరిపాలనపై సభలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. భారత ప్రధా ని దేశంలో ఎన్నో నూతన సంస్కరణలు తీసుకొచ్చారని, వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసారని అందులో భాగంగానే రైతులకు సబ్సిడీపై ఎరువుల బస్తాలు, యాంత్రిక పరికరాలు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కోట్లాదిమంది రైతులకు ఎం కిసాన్ కిషన్ పథకం ద్వారా పంటల సాగు కోసం ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో ప్రపంచ దేశాలని అతలా కుతలమైన, మన ప్రధాని ఎంతో సమన్వయముతో వ్యవహరించి ప్రజలందరికీ వ్యాక్సిన్ ఇప్పించి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన ఘనత ప్రధానికే దక్కిం దన్నారు. చిరు వ్యాపారులకు ముద్ర లోన్లు ఇచ్చిందన్నారు. అలాగే పి ఎం జి ఎస్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు తారు రోడ్లోనూ నిర్మించడం జరిగిందన్నారు. ఇంకా అత్యాధునిక ఏర్పాట్లతో దేశంలోని ఎన్నో రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా రాష్ట్ర రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఎప్పటికప్పుడు కేటాయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే విమర్శించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూ ప్రపంచంలోనే దేశానికిమంచి గుర్తింపు తీసుకొచ్చిందని ఆమె కొనియాడారు.

గతంలో పది సంవత్సరాలపాటు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మీ మ్‌దేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణానికి చేసిన కృషి ఏమీ లేదని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ప్రాజెక్టు నిర్మాణం పై చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడు నిర్మాణం ప్రారంభించి ఎప్పుడు పూర్తి చేస్తారు ప్రజలకు చెప్పాలని ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డిని కోరారు. కెసిఆర్ బాటలోని రేవంత్ రెడ్డి నడుస్తున్నారని, ముఖ్యమంత్రిగా పాలమూరు ప్రజలు అవకాశం ఇచ్చారని, ఇకనైనా డ్రామాలుమాని ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించాలని రేవంత్ రెడ్డికి సూచించారు . గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నిటిని అమలుపరచాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామీణ రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు చిట్టి లక్ష్మీ మ్‌కాంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అంది బాబయ్య, స్థానిక మాజీ ఎంపీపీ మణికొండ రంగయ్య గౌడ్, షాద్నగర్ మున్సిపల్ కౌన్సిలర్ పేట అశోక్, పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్, పార్టీ నాయకులు భూపాల చారి కందూరి మనోహర్,రెడ్డి బలవంత్ రెడ్డి శివారెడ్డి, విజయభాస్కర్, శ్రీనివాస్, ఎగిరే రాజు, సున్నాల అంజయ్య తో పాటు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో ఎంపి పర్యటన

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 10,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలో బుదవారం పాలమురు ఎంపి డికె అరుణ పర్యటించారు. మండలంలోని గుర్రంపల్లి గ్రామంలో హైమాక్స్ లైట్లు ప్రారంబించి, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు స్థల పరిశీలన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ఎప్పటి వరకు నిర్మిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వెంటనె ప్రారంబించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఫ్యూచర్ సిటీలో సిఎం సభకు తరలిన మహిళలు

**తలకొండపల్లి, జూన్ 10, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి బుధవారంనాడు హైదరాబాద్ సమీపంలో నిర్వహించే సిఎం సభకు మహిళలు తరలివెళ్లారు. తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఆధ్వర్యంలో వెల్జాల్ వెంకటాపూర్ చుక్కాపూర్ గ్రామాలనుంచి ఫ్యూచర్ సిటీలో సిఎం రేవంత్ రెడ్డి నిర్వహించే సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మహిళలు తరలివెళ్లారు.

## ఇంటి నిర్మాణానికి చీకులు, సిమెంటు పంపిణీ

**తలకొండపల్లి ,జూన్ 10, ప్రభాతవార్త:**



ఇంటి నిర్మాణంలో పాల్గొన్న సర్పంచ్ శేఖర్ యాదవ్

తలకొండపల్లి మండల కేంద్రంలో బుధవారం నాడు పోతుగంటి పెంటయ్య ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి సీక్లు సిమెంటు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ ఆధ్వర్యంలో గ్రామంలోని నిరుపేద వారికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని నిరుపేద వారికి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సహకారంతో ఆర్థిక సహాయ సహకారాలు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామంలో గుడిసెలు లేకుండా ఉండేందుకు ప్రతి ఒక్క నిరుపేద వారికి సాయం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ కోటీశ్వర్ వార్డు సభ్యులు పోతుగంటి కుమార్, వెంకటేష్ యాదవ్, పెరుమాళ్ళ జంగయ్య, నరసింహ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**కేశంపేట, జూన్ 10, ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన కందికంటి జంగమ్మ బుధవారం తెల్లవారుజామున ఆకస్మికంగ మృతి చెందింది. జంగమ్మ మృతి చెందిన విషయాన్ని వేముల నర్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆమె మృతురాలి కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయంగా 5000 వేల రూపాయలను గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మృతురాలి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మనోధైర్యం కల్పిస్తూ అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గొప్ప మనసుతో ఆర్థిక సహాయాన్ని అందించిన మాజీ జడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డికి మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులకు మృతురాలి కుటుంబ సభ్యులు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించిన వేములనర్వ గ్రామ సర్పంచ్ పల్లె మోని సువర్ణ నరసింహులు, డిప్యూటీ సర్పంచ్ రమేష్ నాయక్, మాజీ సర్పంచ్ మంజుల మల్లేష్, చిర్ర శ్రీను, సరికొండ రమేష్, బోడ కృష్ణయ్య గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

**రంగారెడ్డి అర్బన్ , జూన్ 10,ప్రభాతవార్త :** బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం... చంద్రాయణగుట్ట బర్కాస్‌కు చెందిన మొహమ్మద్ ఇస్రార్ అహ్మద్ ఖాన్ (38) వ్యాపారి తన యమహా ఆర్ 15 మోటార్ సైకిల్ (టిజి 12ఈ8941)పై కొత్తూరు నుండి శంషాబాద్ వైపు ప్రయాణిస్తున్నాడు. మంగళవారం రాత్రి సుమారు 1:30 గంటల సమయంలో తొండుపల్లి కొత్త బ్రిడ్జి వద్దకు చేరుకున్నప్పుడు బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావ్వడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు,కుటుంబ సభ్యులు వెంటనే అతడిని శంషాబాద్‌లోని లీమ్స్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రగతి ప్రణాళికతో మెరుగైన అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న పరిగి చైర్ పర్సన్ రజిత వెంకటేష్

**పరిగి, జూన్ 10, ప్రభాతవార్త :**

పరిగి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ అన్నారు.

బుధవారం పరిగిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వ హిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్య క్రమాన్ని నిర్వహించారు.. ప్రజా పాలన ప్రగతిప్రణాళికలో భాగంగా పట్టణం లోని పలు వార్డుల్లో వార్డుసభనిర్వహించి,ప్రభుత్వం చేపడుతున్న కార్య క్రమాలను ప్రజలకు వివరించారు. పరిగి పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రజిత తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడానికి అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో పరిగి పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లేష్, కౌన్సిలర్లు షాహేదా బేగం, హబీబునిసఅయ్యూబ్, యూసుఫ్, రవీంద్ర, తాహేర్ కోఆప్షన్ మెంబర్లు అక్బర్ హుస్సేన్ ,ఆంజనేయులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాములు ,నాయకులు పాల్గొన్నారు.

## శంకర్‌యాదవ్‌కు నివాళి

**శామీర్‌పేట, జూన్ 10, ప్రభాతవార్త**

తుర్కపల్లిలోని బాలాజీ పంక్షన్‌హాల్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు తలసాని శంకర్‌యాదవ్ ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సోదరుడు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, అల్లుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌లు, మరికొందరు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

బుధవారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో స్వర్గీయ తలసాని శంకర్‌యాదవ్ రెండవ వర్ధంతి సందర్భంగా వారితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని నివాళులు అర్పించారు. స్వర్గీయ తలసాని శంకర్‌యాదవ్ సికింద్రాబాద్ మోండా మార్కెట్ అధ్యక్షునిగా సేవలను అందించారని పలువురు పేర్కొన్నారు.



శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించటంతో ఆయనను మర్యాదపూర్వకంగా మండల మాజీ జడ్పీటిసి సభ్యురాలు ఎం.అనితలాలయ్య కలిసి సన్మానించిన దృశ్యం

## నూతన తహసీల్దార్‌కు సన్మానం

**శామీర్‌పేట, జూన్ 10, ప్రభాతవార్త :** శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాస్‌ను మండల మాజీ జడ్పిటిసి సభ్యురాలు ఎం.అనితలాలయ్య మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బుధవారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయంను ఆమెతో పాటు నాయకులు ఎం.లాలయ్య, వంగ వెంకట్‌రెడ్డి, అశోక్‌లు తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి స్వాగతించారు. శామీర్‌పేట మండలానికి నూతన తహసీల్దార్‌గా వచ్చిన శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టటంతోనే మర్యాదపూర్వకంగా తహసీల్దార్‌ను కలిసినట్లు మాజీ జడ్పిటిసి ఎం.అనితలాలయ్య పేర్కొన్నారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నూతన తహసీల్దార్‌గా కృషి చేస్తారని ఆమె ఆశాభావంను వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి

**మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**

**షాద్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త :** ఎందరో మహనుభావులు ఆనాడు నిరుపేదలకు వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని భూములను సేకరించి ఇచ్చారు. కానీ ఆ భూములన్నీ ఈరోజు అన్యాక్రాంతం అవుతున్నాయి. రైతుల పుట్టగొట్టి రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటిని అన్యాక్రాంతం చేసి అమ్ముకుంటున్నారు.. అలాంటి భూములను గుర్తించి కాపాడాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా తో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతంలో జరిగిన భూదానోద్యమం గురించి ఆయన లేఖలో వివరించారు. హైదరాబాద్ సంస్థానంలో మహారాష్ట్రలోని ఐదు జిల్లాలు, కర్ణాటకలోని నాలుగు జిల్లాలు కలిపి హైదరాబాద్ లో ఉన్న 9 జిల్లాలతో మొత్తం 18 జిల్లాలు భారతదేశంలో అతిపెద్ద సంస్థానంగా ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ఈ సంస్థానంలో భూమికోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం 1946 నుంచి 1951 వరకు సాయిధ పోరాటం జరిగిందని తెలిపారు. ఈ పోరాటంలో కులాలకు, మతాలకు అతీతంగా పేద ప్రజల కోసం ప్రతి ఒక్కరూ పోరాడారని, ఆనాటి మాజీ ఎంపీ, మాజీ శాసనసభ్యులైన భీమ్ రెడ్డి నరసింహారెడ్డి కూడా ఈ పోరాటంలో పాల్గొన్నారు గుర్తు చేశారు. ఈ క్రమంలోనే 1951 అక్టోబర్ 21న రక్షిత కౌలుతారు చట్టం రావడంతో పోరాటాన్ని ఉపసంహరించారని తెలిపారు. ఈ క్రమంలో ఆచార్య వినోబాభావే సాయుధ పోరాటాన్ని ఆపి మిత్రులతో సమస్యలు పరిష్కరించుకోవచ్చని 1951 ఏప్రిల్ 15న శ్రీరామనవమి రోజున హైదరాబాదుకు వచ్చి శివరాంపల్లి లో జరుగుతున్న సర్వోదయ సమ్మేళనం లో పాల్గొని పాదయాత్ర ప్రారంభించి మొదటిసారి భువనగిరి నియోజకవర్గం పోచంపల్లి వాస్తవ్యులు రామచంద్రారెడ్డి నుంచి 100 ఎకరాలు ఘనంగా స్వీకరించాలని తెలిపారు. అదేవిధంగా మహబూబ్ నగర్ జిల్లాలో 41, 771 ఎకరాల భూమిని నిరుపేదల కోసం భూస్వాములు దానం చేశారని అన్నారు. కేవలం రెండు నెలలలో పదివేల ఎకరాల భూమిని సేకరించిన దానికి భూదాన వ్యక్తం చేసి అప్పటి నాయకులు కోదండరామిరెడ్డి, సంఘము లక్ష్మీబాయమ్మ, ఉమ్మిత్యాల కేశవరావు సంచాలకులుగా ఈ భూదాన యజ్ఞం కొనసాగిందని పేర్కొన్నారు. అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు కూడా ఈ యజ్ఞానికి సహకరిస్తూ తన సొంత భూమిని నిరుపేదలకు పంచారని తెలిపారు. ఇదే జిల్లాకు చెందిన మందుమూల నర్సింగరావు భూసంస్కరణల కింద ఏర్పాటు చేసిన ల్యాండ్ కమిషన్ కు చైర్మన్ గా సేవలు అందించారన్నారు. ఇప్పటి గాంధీభవనే ఈ కార్యక్రమాలన్నింటికీ వేదికగా మారిందని గుర్తు చేశారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

**మేడ్చల్, జూన్ 10. ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని కాలనీల్లో డ్రైనేజీ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని పట్టణానికి చెందిన సలీం తెలిపాడు. పట్టణంలోని తన ఇంటికి ఎదురుగా నివసిస్తున్న వ్యక్తి డ్రైనేజీ లైన్‌ను తెరవడంతో మురికి నీరు నిరంతరం రోడ్డుపై ప్రవహిస్తూ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మురుగు నీటి కారణంగా కాలనీవాసులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, సమస్యపై మూడు రోజుల క్రితం మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరాడు.



మేడ్చల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సలీం

## గ్రామ అభివృద్దే లక్ష్యం

**సర్పంచ్ తిరుపతయ్య**

**కుల్కచర్ల,జూన్ 10, ప్రభాతవార్త :** గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ తిరుపతయ్య అన్నారు.బుధవారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ సభనిర్వహించారు.ఈ గ్రామ సభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతయ్య మాట్లాడుతూ..గ్రామ అభివృద్దే లక్ష్యంగాప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుటామని భరోసా ఇచ్చారు. అనంతరం బదిలీపై వెళిన పంచాయతి కార్యదర్శిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి ఎంపిడిఓ రామకృష్ణ నాయక్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు గ్రామ సీనియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సకరించాలి

**సర్పంచ్ ప్రవీణ్ కుమార్**

**కుల్కచర్ల,జూన్ 10, ప్రభాతవార్త :** గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సకరించాలని సర్పంచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని కుసుమద్రం గ్రామంలో 99 రోజుల ప్రణికలో భాగంగా గ్రామ సభనిర్వహించారు.ఈ గ్రామ సభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్దే లక్ష్యంగాప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారిఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు గ్రామ సినియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్

# కీసరగుట్టలో ఎంపి ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు

**కీసర,జూన్10,ప్రభాతవార్త:**

భారతదేశానికి సుదీర్ఘకాలంగా సుపరిపాలన అందిస్తూ అత్యధిక రోజులు ప్రధానమంత్రిగా సేవలందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరెన్నో సంవత్సరాలు మంచి ఆరోగ్యంతో దేశానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ప్రత్యేక అభిషేకం కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ దేశాభివృద్ధి,ప్రజా సంక్షేమం,ప్రధానమంత్రి మోడీ అయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని డిని ప్రార్దించారు.తన జీవనశైలిలో ఏ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా నిర్విరామంగా పనిచేస్తున్న మన భారతదేశ నిజమైన సైనికుడు,కలియుగ పురుషుడైనటువంటి నరేంద్రుడు నిండు ఆయుష్షుతో ఈ యొక్క భారతదేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్,రాష్ట్ర నాయకులు విక్రంరెడ్డి,మేడ్చల్ కంటెస్ట్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్‌రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,జిల్లాల తిరుమల్‌రెడ్డి,మునుగంటి సురేష్,రామోజీ,కౌకుట్ల చంద్రారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శులు అమరం మోహన్‌రెడ్డి,గోనె శ్రీనివాస్,బుద్దవరం లక్ష్మీ,జిల్లా కార్యదర్శిబోడ శ్రీనివాస్‌రావు,డివిజన్ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్,నాయకులు బసవరాజు గౌడ్,కమల్,నరేష్ పటేల్,జోగారావు,సురేష్ నాయక్,రాగుల అశోక్,మెట్టు క్రిష్ణ యాదవ్,దేశం మల్లేష్ గౌడ్,కొలిచెలిమి క్రిష్ణ,చినింగణి సుధాకర్,చీర సురేష్,నల్ల వెంకట్‌రెడ్డి, అబ్రబోయిన నాగరాజు,కోల మహేందర్,తర్రె సత్యనారాయణ,అబ్రబోయిన జంగాలు,మెట్లు మహేందర్,పొట్ట ఆంజనేయులు,పవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఎంపి ఈటల రాజేందర్



కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరసామి సన్నిదిలో ఎంపి ఈటల రాజేందర్

## దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఉచిత అల్పాహార పథకం ప్రారంభం'

**-ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయం పట్ల స్థానికుల హర్షం!**

**దౌల్తాబాద్,జూన్ 10,ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ ప్రభుత్వం మరో విప్లవాత్మక అడుగు వేసింది.దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉచిత అల్పాహార పథకాన్ని' బుధవారంరోజు ఘనంగా ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల ఆరోగ్యానికి,చదువుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని పలువురు నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరన్న,స్థానిక సర్పంచ్ బి.శ్రీనివాస్ రెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్ టి.వసంత ,హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీహరిరెడ్డిలతో కలిసి విద్యార్థులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి ఈ పథకాన్ని ప్రారంభించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ.."ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఉదయాన్నే పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయం అని అన్నారు.ఇది విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడమే కాకుండా,వారిలో ఏకాగ్రతను పెంపొందిస్తుందని ఈ సంధర్భంగా నాయకులు,ఉపాధ్యాయులు,జూనియర్ కళాశాల లెక్చరర్లు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా ఇలాంటి అద్భుతమైన అల్పాహార పథకాన్ని తీసుకురావడం పట్ల అటు విద్యార్థులు,ఇటు స్థానిక ప్రజలు,తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# సురంగల్ స్మశాన వాటికకు పునరుజ్జీవం

**డంపింగ్ చెత్తతో దశాబ్దాలుగా కంపుకొట్టిన స్మశానం**

**జేసీబీ, దోజర్లతో పూర్తి ప్రక్షాళన**

**మొయినాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా 14వ వార్డు సురంగల్ స్మశాన వాటిక పరిశుభ్రత కార్యక్రమం పూర్తి.మొయినాబాద్ మున్సిపాలిటీ సురంగల్ 14వ వార్డు పరిధిలోని సురంగల్ స్మశాన వాటికను 99 రోజుల ప్రత్యేక పారిశుధ్య ప్రణాళికలో భాగంగా పూర్తి స్థాయిలో పరిశుభ్రపరచడం జరిగిందని వార్డు కౌన్సిలర్ శ్రీ ..కర్రోల్ల శ్రీధర్ అన్నారు నేపథ్యం: దశాబ్దాల సమస్య గత అనేక సంవత్సరాలుగా స్థానికులు సురంగల్ స్మశాన వాటిక ఆవరణలో డంపింగ్ చెత్తను వేయడం వలన ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. పర్యావరణం దెబ్బతినడంతో పాటు, అంత్య క్రియల నిమిత్తం వచ్చే బంధువులు సమాధుల వద్దకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గొయ్యి తవ్వే కార్మికులు సైతం అక్కడ పని చేయలేకపోయేవారు.ప్రజల ఇబ్బందులను గుర్తించి, మున్సిపల్ చైర్మన్ గారి సూచనల మేరకు జేసీబీ, ట్రాక్టర్ దోజర్లను ఏర్పాటు చేసి టన్నుల కొద్దీ పేరుకుపోయిన చెత్తను తొలగించి, భూమిని చదును చేసి పూర్తిగా పరిశుభ్రం చేసినట్లు కౌన్సిలర్ గారు వివరించారు.కౌన్సిలర్ ప్రకటన: "ప్రజల మనోభావాలతో ముడిపడిన సురంగల్ స్మశాన వాటికను శుభ్రంగా ఉంచడం మా ప్రథమ కర్తవ్యం. ఇకపై ఇక్కడ చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది" అని శ్రీ కర్రోల్ల శ్రీధర్ గారు స్పష్టం చేశారు.

**ప్రజా స్పందన:**

సురంగల్ స్మశాన వాటిక శుభ్రతతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేసి కౌన్సిలర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.




సురంగల్ స్మశాన వాటిక పరిశుభ్రత పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్.

# సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి



ఎంపి డికె అరుణకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 10,(ప్రభాతవార్త):** యూరియా కోసం రైతులు వాడుతున్న యాప్ లో సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నారని ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతు జిల్లెడు చౌదరిగూడ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు యూరియా ఎరువుల కొరత ఏర్పడుతోందని తెలిపారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న తరుణంలో యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎరువుల కోసం రైతులు అనేక కష్టాలు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జంగయ్య, నీలయ్య, మాజీ సర్పంచ్‌లు బాలరాజు, సలీం, నర్సింలు, యాదయ్య, మహిళా అధ్యక్షురాలు రజిత, చలివేంద్రంపల్లి రాజు, పాపయ్య, ఆంజనేయులు, గోబ్రా నాయక్, అజ్జు, నవీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

**ఉద్యమకారులు సంఘటితమై.. హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నం**

**షాద్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త :** ఉద్యమకారులు అంత సంఘటితమై వారి హక్కుల కోసం పోరాడాల్సిన సమయం తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డిపిడమర్తి రవిని సన్మానించిన వెంకట్ రాంరెడ్డి, కౌన్సిలర్ దిలీప్ కుమార్, విద్యార్థి నేత జాంగారి రవిషాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కర పత్రాన్ని స్థానిక ఉద్యమకారులతో కలిసి విడుదల చేసిన పిడమర్తి రవిజూన్ 21న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని స్థానిక ఉద్యమ కారుల ఆధ్వర్యంలో ఈరోజు షాద్ నగర్ బ్లాక్ ఆఫీస్ ముందు ప్రొఫెసర్ జయ శంకర్ విగ్రహం వద్ద విడుదల చేసిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇటి స్థలం పింఛన్ గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రధాన డిమాండ్‌తో జూన్ 21న ఇందిరాపార్క్ హైదరాబాదులో ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శతాబ్ద కాలంలో అతిపెద్ద ఉద్యమం జరిగింది అంటే అది కేవలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మాత్రమే, అంత పెద్ద ఉద్యమానికి నాయకత్వం వహించిన తెలంగాణ ఉద్యమ వీరులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం. అదేవిధంగా ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఘనమైన నివాళులు అర్పిస్తున్నాం. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో స్వరాష్ట్రం కోసం ప్రాణాలు తెగించి ఉద్యమించిన ఉద్యమ కారులందరినీ గౌరవించుకోవడానికి తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహిస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం దక్కలేదు ఏదో కొంతమందికి చిన్న చిన్న పదవులు ఇచ్చిన ముఖం చాటేశారు తప్ప తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన విద్యార్థి ఉద్యమ నాయకులకు కార్మికులకు తగిన ఫలాలు దక్కలేదు అలాంటి సందర్భంలో ప్రజా ప్రభుత్వం పాలనలోకి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను గుర్తించాలని కేశవరావు ఆధ్వర్యంలో కమిటీ వేసి గుర్తింపు చర్యలు చేపట్టడం జరిగింది ఈ చర్యను తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆహ్వానిస్తుంది. అదే సమయంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వేలాదిమంది ఉద్యమకారుల పైన పోలీసు కేసు కాకపోవడం వల్ల ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అందరికీ ఉద్యమకారులకు ఇవ్వవలసిన దక్కవలసిన ఫలాలు దక్కకుండా పోతావేమో అనే అపోహములో అందరమూ ఉన్నాము, ఇలాంటి అపోహల ఉన్న సందర్భంలో ఉద్యమకారులు అంత సంఘటితమై వారి హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైనది. తెలంగాణ రాష్ట్ర కోసం వారి వారి స్థాయిలో ఉద్యమం చేసిన వారిని అందరిని గుర్తించి తెలంగాణ ఉద్యమకారులకు దక్కవలసిన ఫలాలను అందించే బాధ్యత తెలంగాణ ఉద్యమకారుల సంఘంపై ఎంతైనా ఉంది అని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ప్రధానమైన డిమాండ్స్ గురించి మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి,ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలి, ఉద్యమకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలి, ఉద్యమ కారులకు పింఛన్ ఇవ్వాలిఈ నాలుగు ప్రధానమైన డిమాండ్లతో అప్పటి తెలంగాణ విద్యార్థి ఉద్యమ రథసారథి విద్యార్థి జేఏసీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో అనేక మంది మంత్రులకు కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అదేవిధంగా మీడియా సమావేశాలు నిర్వహించి ఈ మూడు డిమాండ్లను చెప్పడం జరిగింది .

కావున తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరూ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో ఉద్యమ కారులకు రావలసిన ఈ న్యాయమైన వాట గురించి తమ గొంతులు వినిపించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఊపిరి పోసి, తెలంగాణ ఉద్యమకారుల సంఘానికి మొదటి నుంచి ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరిస్తున్న రాష్ట్ర పురావస్తు, సంస్కృతిక, ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం జరుగుతుంది జూన్ 21 2026 నాడు ఇందిరా పార్క్ లో వేలాదిమంది తెలంగాణ ఉద్యమకారులతో తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది కావున ఈ కార్యక్రమానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డు ఇవ్వాలని అదేవిధంగా సంక్షేమ పథకాలను అందించాలని ప్రజా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి వెంకట్ రాంరెడ్డి, కౌన్సిలర్ దిలీప్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ మాంగులాల్ నాయక్, విద్యార్థి నేత జాంగారి రవి, ఉద్యమ కారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మేకల వెంకటేష్, రవి కుమార్ గౌడ్,బి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బొరెళ్ళి సురేష్, రహీమ్,నేతలు కుడుముల మల్లేష్, ప్రసాద్, సిందం విటలయ్య,శేఖర్ గౌడ్, సింగపాగ శివ, సామెల్, రామకృష్ణ, చింటు తదితరులు పాల్గొన్నారు.




గోడపత్రికను విడుదల చేసి మాట్లాడుతున్న ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

**షాద్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త :** బుడగజంగాల సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పాటుగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బుడగజంగాల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తన సొంత ఇంటి స్థలాన్ని వర్క్ రిజిస్ట్రేషన్ చేసి, సుమారు రూ.20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్-చేగూర్ రోడ్డులో విశ్వసాయి వెంచర్‌లో బుడగజంగాలు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే తన లక్ష్యమని, బుడగజంగాల సామా జిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ రాజు నాయక్, మురళీమోహన్ (అప్పి), దిలీప్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, శ్రీను నాయక్, శ్రీశైలం గౌడ్, జయప్రకాష్, మంగ అశోక్ ముదిరాజ్, సుదర్శన్, రోమియో రమేష్, అన్వర్‌తో పాటు ఎస్సీ బేడ బుడగజంగం సంఘం అధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్, ఉపాధ్యక్షుడు సదుల ముత్యాలు, సంఘ ప్రతినిధులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బుడగజంగాల సంఘ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ సమాజానికి శాశ్వత ఆస్తిగా నిలిచే కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. "నిండు ఆకాశమంత మనసున్న శంకరయ్య" అంటూ ఎమ్మెల్యే సేవలను కొనియాడారు.

## గృహ కార్మికుల విషయంలో నివాసితులు జాగ్రత్తలు పాటించాలి

**మేడ్చల్, జూన్ 10, ప్రభాతవార్త :** ఇండ్లల్లో పని చేసే కార్మికులతో జాగ్రత్తగా ఉండాలని, పోలీసులు ధృవీకరించిన వారినే ఇండ్లల్లో పని వారిగా నియమించుకోవాలని, ముఖ్యంగా నేపాలీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ సిఐ సత్యనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గృహ కార్మికులు, సంరక్షకులు (కేర్‌టేకర్లు), ఇంటి పనివారిగా ఇండ్లల్లో చేరుతున్న నేపాలీలు ఇంటి యజమానుల నమ్మకం, సానుభూతిని సంపాదించి అనంతరం దొంగతనాలతో పాటు ఇతర ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటీవల ఇటువంటి మూడు కేసులు జరిగాయని, అందులో ఒకటి లాభం కోసం చేసిన హత్య (మర్డర్ ఫర్ గెయిన్) కేసుతో సహా, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని, నివాసితులు గృహ కార్మికులను నియమించుకునే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గృహ కార్మికుల విషయంలో పోలీసు ధృవీకరణ విధానాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సాధారణంగా నేరస్తులు అనధికారిక, ధృవీకరించలేని సిఫార్సుల ద్వారా ఉద్యోగం పొందుతారని, కుటుంబ సభ్యుల విశ్వాసాన్ని త్వరగా సంపాదించే ప్రయత్నం చేస్తారని తెలిపారు. అదే విదంగా ఇంట్లోని విలువైన వస్తువులు, కుటుంబ సభ్యుల దినచర్యలు, భద్రతా ఏర్పాట్ల సమాచారాన్ని సేకరించి ఇంటి యజమానులు లేని సమయంలో దొంగతనానికి పాల్పడుతారని పేర్కొన్నారు. సాధ్యమైనంతవరకు నేపాలీ గృహ కార్మికులను నియమించుకోకుండా ఉండాలని, ఒకవేళ నియమించినట్లయితే, వారివి చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రం, ఫోటోలు, మొబైల్ నంబర్, శాశ్వత చిరునామాను ధ్రువీకరించుకోవాలని, గృహ కార్మికుల వివరాలను రికార్డు నిర్వహణ కోసం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని తెలిపారు. ఇండ్లల్లో సాధ్యమైన చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని, విలువైన వస్తువులు, లాకర్లు, సున్నితమైన ప్రాంతాలకు కార్మికుల పవేశాన్ని పరిమితం చేయాలని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు, సమాచారం తెలిసిన వెంటనే మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లోని 8712663280, 8712663281, 8712663289 ఈ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

## ఫ్యూచర్ సిటీ సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**యాచారం,జూన్10, ప్రభాతవార్త:**

ఫ్యూచర్ సిటీ తో ఈ ప్రాంతం అభివృద్ధిలో ప్రథమ స్థానం లో ముందుకు సాగుతుందని కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం అన్నారు. బుధవారం కందుకూరు మండల బేగరికంచి సమీపంలోని ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని ఎఫ్ సి డి ఏ పరిధిలోని గ్రామ ప్రజలందరూ భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మోటె శ్రీశైలం మాట్లాడుతూ. .తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలన్నీ కాంగ్రెస్ హయంలోనే అభివృద్ధి పథంలో నడిచే దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీతో గ్రామాలన్నీ ఆధునికరణతో అభివృద్ధి జరిగి ఈ ప్రాంతంలో ఉపాధి కల్పన మెరుగుపడి ఎంతో విప్లవత్మకంగా ఆచలంచెలుగా అభివృద్ధి జరుగుతుందన్నారు. అభివృద్ధిని స్వాగతించాలని వ్యతిరేకించడం సరికాదని హితవుపలికారు. యాచారం మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల నుండి బస్సులలో భారీ ఎత్తున ప్రజలు కార్యక్రమానికి బయలుదేరారు.

## సర్ పై అవగాహన

**..మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, ప్రభాతవార్త:**

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లేవల్ ఏజెంట్లు (బిఎల్ఏ)కు కేంద్రం తెచ్చిన సర్ (ఎస్ఐఆర్)పై శిక్షణా కార్యక్రమం గురువారం అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ వేద్ కన్వెన్షన్‌లో జరుగుతుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు(డిసిసి),మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గం శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ వేద్ కన్వెన్షన్‌లో శిక్షణా కార్యక్రమం గురువారం ఉదయం 10గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో 602బూత్‌లు ఉన్నట్లు వీటికి కాంగ్రెస్ పార్టీ నుంచి బిఎల్ఏలు ఉన్నట్లు అందరు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన ఎస్ఐఆర్ (సర్) స్పెషల్ ఇన్సెంటీవ్ రివిజన్ పై బిఎల్ఏలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. టిపిసిసి నియమించిన ట్రైనర్ల ద్వారా బిఎల్ఎలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఓటరు జాబితాలపై అవగాహన, ఓటర్లను తొలగించకుండ ఉండటానికి కాంగ్రెస్ బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండటానికి ప్రజలకు అవగాహణ కల్పించటానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. బిఎల్ఏలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని డిసిసి వజ్రేశ్‌యాదవ్ సూచించారు.